క్లుప్తంగా

నూతన ఓసీలో టెండర్ కేటాయించండి..

ఇల్లెందు: పూసపల్లి ఓసీలో పని చేసుకునేందుకు ఆదివాసీ తుడుందెబ్బ సంఘానికి టెండర్‌కు అవకాశం కల్పించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామస్వామి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు.

మండల స్థాయి పాఠశాల ఆటలపోటీలు

టేకులపల్లి: 2, 3 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ టేకులపల్లి గవర్నమెంట్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అండర్ 14, 17 విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని యాజమాన్య ప్రైవేటు, గవర్నమెంట్, జెడ్పీ, గురుకుల, ఏకలవ్య ఆశ్రమ కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దివ్యాంగులు

ఇల్లెందు: సత్యనారాయణపురానికి చెందిన దివ్యాంగుడు రవీందర్‌రెడ్డి రక్తహీనతతో బాధపడుతూ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. సమాచారం అందుకున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల ప్రధాన అధ్యక్ష, కార్యదర్శులు తేళ్ల ప్రవీణ్‌కుమార్, సీహెచ్ రాజేందర్, శివాజీల సహకారంతో ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

చర్యలు తీసుకోండి..

జూలూరుపాడు: ఎస్టీ జాబితా నుంచి బంజారాలు, లంబాడీలను తొలగించాలనడం చట్ట విరుద్ధమని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు అన్నారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ బంజారా, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తీసివేయాలంటూ ఆదివాసీ నాయకులు సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టులో కేసు వేయడం అప్రజాస్వామికం అన్నారు. రెండు తెగల మధ్య వైషమ్యాలు పెంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. బురదమయంగా మారగా పైపులైన్లు వేసేందుకు అదే మార్గంలో జేసీబీని తీసుకెళ్లడంతో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రమదానం



ముళ్ల పొదలు తొలగిస్తున్న ఆటో కార్మికులు

జూలూరుపాడు: కాకర్ల – పడమటనర్సాపురం మధ్య బీటీ రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను ఆదివారం కాకర్ల ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నాలుగు కిలోమీటర్ల పరిధిలో శ్రమదానం చేసి తొలగించారు. కార్యక్రమంలో కొండే రమేష్, గున్నం వెంకటేశ్వర్లు, సొబ్బని నరసింహారావు, ఉడుతా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల లెక్క పక్కా

- సమగ్రంగా వివరాల సేకరణ
- ముమ్మరంగా వానాకాలం పంటల సర్వే
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



కోమటిపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

సుజాతనగర్: వానాకాలం పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగనుంది. ఈ మేరకు వ్యవసాయాధికారులు మండల వ్యాప్తంగా శనివారం నుంచి పంటల సర్వే చేపట్టారు. సుమారు రెండు నెలల పాటు అక్టోబర్ 25 వరకు పంటల సర్వే చేపట్టనున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ... సర్వే నంబర్ల వారీగా ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు సాగుచేశారనే వివరాలను సేకరిస్తున్నారు. ఆయా వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సర్వే ఆధారంగా పంటలకు అవసరమయ్యే ఎరువులు సమకూర్చడంతో పాటు పంట కొనుగోళ్ల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

అత్యధికంగా పత్తి సాగు.. మండలంలో గతేడాది 13,946 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేయగా.. ఈ ఏడాది 14,616 ఎకరాల్లో సాగుచేశారు. ఇందులో అత్యధికంగా 11,645 ఎకరాల్లో పత్తి, 2,695 ఎకరాల్లో వరి, 70 ఎకరాల్లో మొక్కజొన్న, 6 ఎకరాల్లో పెసర, 56 ఎకరాల్లో కందులు, 150 ఎకరాల్లో ఇతర పంటలను సాగుచేశారు.

ఆశాజనకంగా పత్తి సాగు.. తెల్లబంగారంగా పిలవబడే పత్తి సాగు సుజాతనగర్ మండలంలో ఆశాజనకంగా కనిపిస్తోంది. కోయగూడెం, సీతంపేట, కోమటిపల్లి, నిమ్మలగూడెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, సింగభూపాలెం, బేతంపూడి, సింగభూపాలెం, జామ్లా తండా తదితర గ్రామాల పరిధిలో అత్యధికంగా ఈ పంటను సాగు చేశారు. గత ఏడాది క్వింటా పత్తి ధర రూ.7 వేలు పలికింది.

వర్షాలు విస్తారంగా కురవడంతో పత్తిలో కలుపు కూడా అధికంగా రావడంతో రైతులు కలుపు తీత ఖర్చులు అదనం అయ్యాయి. ప్రస్తుతం పత్తి పంట పూత దశకు చేరుకుంది. మరో నెలరోజుల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి రూ.60 వేలు అయింది..



రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశాను. ఇప్పటి వరకు రూ.60 వేల పైనే పెట్టుబడి అయింది. నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చేలల్లో నీరు నిలిచి మొక్కలు ఎర్రబారుతున్నాయి. దిగుబడి ఎలా ఉంటుందో.

– చింతాల నరసింహారావు, నాయకులగూడెం

క్వింటా రూ.10 వేలు ఉండాలి..



ప్రతీ ఏటా పంటలకు అయ్యే ఖర్చులు పెరుగుతున్నాయి. ఖర్చులకు అనుగుణంగా దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోంది. సుమారు రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. క్వింటా రూ.10 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుంది.

– జూపెల్లి పుల్లయ్య, రాఘవాపురం

వివరాలు నమోదు చేస్తున్నాం.



అక్టోబర్ 25 వరకు పంటల సర్వే చేపట్టి వివరాలను నమోదు చేయడం జరుగుతుంది. రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలి. నమోదు కాకపోతే, సంబంధిత అధికారులను సంప్రదించాలి.

– గాండ్ల నర్మద, మండల వ్యవసాయాధికారి

15న కోల్‌కతాలో రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ల సమస్యల సాధనకు పెన్షనర్ ఆధ్వర్యంలో ఈనెల 15న కోల్‌కతాలో జరపతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి వెలుతురు ప్రసరింపజేసేందుకు తమ జీవితాలను పణంగా పెట్టిన కోలిండియా, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయని వాపోయారు.

నేటి నిత్యావసర ధరలకు అనుగుణంగా కరువు భత్యం పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఈ సమస్యలపై కేంద్ర మంత్రులకు, నాయకులకు విన్నవించినా ఫలితం రాలేదని పేర్కొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేషన్ చిట్టి రామవరం తండాకు చెందిన అర్హులైన నిరుపేద రైతులకు తక్షణమే పోడు పట్టాలి ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ నాయకులు బానోత్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన ఆరాధ్య దేవతలకు పూజలు నిర్వహించి, తమకు పోడు పట్టాలు వచ్చే విధంగా అనుగ్రహించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గరీబ్‌పేట పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ బీట్‌లోని ఫారెస్ట్ భూమి కంపార్ట్‌మెంట్ నంబరు 1 సర్వే నంబరు 20లోని ఆర్‌ఓఎఫ్‌ఆర్ ఫారెస్ట్ భూములను 1980 నుంచి 45 సంవత్సరాలుగా పూర్వికుల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు.

గత ప్రభుత్వం 50 శాతం మందికి కూడా పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్, జి.బుజ్జి, బి.కిషన్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులపై దాడులు ఆపండి..

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలో పోడు సాగు చేసుకుని, అప్పులు చేసి పంటలు పండిస్తున్న రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అటవీశాఖ అధికారులు పంటలను ధ్వంసం చేయడం దారుణమని పంట చేలపై దాడులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ నాయకులు రాములమ్మ, మంకెన వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మందేరలకపాడు, పడగొనిగూడెం, లక్ష్మీదేవిపల్లి గ్రామాల పరిధిలో పదేళ్లుగా పోడు సాగు చేసుకుని పత్తిపంట చేలను సమాచారం ఇవ్వకుండానే అధికారులు ధ్వంసం చేశారని వాపోయారు. అధికారులు రైతులతో మాట్లాడిన తర్వాత చర్యలు తీసుకోవాలని కోరారు.

సెక్యూరిటీ యూనియన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సెక్యూరిటీ గార్డ్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే.సుబ్రహ్మణ్య చారి (సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు), అధ్యక్షుడిగా సీహెచ్.లక్ష్మయ్య, కార్యదర్శిగా మాలోత్ రవీందర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.మహేశ్వరరావు, రంజిత్, సహాయ కార్యదర్శులుగా నవీన్, శేఖర్, కోశాధికారిగా సీహెచ్.బాలాజీ, ఈసీ మెంబర్లు ప్రకాష్, జానకీరామ్, శోభారాణి, మునీర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వై.సోమన్న, టి.సాంబయ్య, ఎస్.రాము, ఎస్.రమేష్, టి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితం ప్రశాంతంగా గడపాలి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ ఖాన్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖాన్ దంపతులను ఘనంగా సన్మానించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజల శాంతిభద్రతలకు కృషి చేసిన ఖాన్ సేవలు మరువలేనివని, ఆయన శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రతాప్, కరుణాకర్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా రామ్మూర్తి



జూలూరుపాడు: బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చాపలమడుగు రామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జూలూరుపాడులో బీఆర్‌ఎస్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించగా, జూలూరుపాడుకు చెందిన రామ్మూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, రాయపాటి వెంకటేశ్వర్లు, తాళ్లూరి రామారావు, లకావత్ హేమ్లా, బానోత్ చందర్, బాదావత్ వెంకట్రామ్, నాగభూషణం, పుల్లయ్య, భూక్యా సేవా, బుడిపూడి ప్రభాకర్, పోతురాజు రామారావు, వాడా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

కొత్తగూడెంటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని కలిగిస్తాయని కొత్తగూడెం సీఐ కొండపర్తి నరేష్, జేబీపీ స్టేట్ ప్రసిడెంట్ న్యాయవాది యర్రా కామేష్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మీడియా లెవన్, న్యాయవాదుల (ఐఎల్‌పీఏ) టీంల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. న్యాయవాదుల టీం విజేతగా నిలిచింది. సీఐ నరేష్ బహుమతి ప్రదానం చేశారు.

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్

ఇల్లెందు: గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎన్డీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి, సామేల్, డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ కార్మికులు గ్రామాలను పరిశుభ్రంగా చేస్తున్నారని, అయినా చాలీచాలనీ వేతనాలతో అర్ధాకలితో అలమటిస్తున్నారని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావూరి ఉపేందర్‌రావు, చింతల భాగ్యమ్మ, భీముడు, తిరుపతి, నరసింహారావు, ప్రవీణ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో వర్గపోరు బహిర్గతం

టేకులపల్లి: బీఆర్‌ఎస్ వర్గ పోరుకు టేకులపల్లిలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశం వేదికైంది. సాక్షాత్తూ జిల్లా అధ్యక్షుడి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ భర్తపై పలువురు ఇల్లెందుకు చెందిన సీనియర్ నాయకులు తిరగబడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భర్త హరిసింగ్ పలువురు నాయకులను మందలించారు. నేను చెప్పినా వినకుండా సంజీవ్‌నాయక్‌ను కలుస్తున్నారని, ఆయన మీటింగుల్లో పాల్గొంటున్నారని, మీరు పెద్ద తోపులు అనుకుంటున్నారా, దిండిగల రాజేందర్ చెప్పుచేతల్లో మీరు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇచ్చేది నేనే. మళ్లీ అధికారంలోకి రాగానే మీ అంతు చూస్తాను.. అంటూ బెదిరించారు. దీంతో సదరు నాయకులు వెంటనే వెళ్లి దిండిగల రాజేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన రేగా కాంతారావు దృష్టికి తీసుకెళ్లగా ఇరువుని పిలిచి సర్ది చెప్పారు.

ఆ తరువాత పార్టీ కార్యాలయంలో రేగా కాంతారావు ఉండగానే ఆఫీసు బయట మరో సారి సదరు నాయకులకు, మాజీ ఎమ్మెల్యే భర్త మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు నాయకులు హరిసింగ్ తీరుపై ఆగ్రహంతో తిరగబడ్డారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ జోక్యం చేసుకుని నాయకులను వారించారు. దిండిగల రాజేందర్ ఆఫీసుకు ఎవరూ వెళ్లొద్దని కూడా హుకూం జారీ చేసినట్లు కూడా సమాచారం.

7న ఔట్ సోర్సింగ్ కార్మికుల సదస్సు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు.

మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్, స్కీం కార్మికులను పర్మనెంట్ చేసి కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఉపాధి భద్రత, పని స్థలాల్లో రక్షణ, సమాన వేతనం 8 గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులతో పాటు ఆశ, అంగన్‌వాడీ మిడ్ డే మీల్స్, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మోత్కురి మల్లికార్జున్‌రావు, ఎస్.సంజీవ్, శరత్, అవినాష్, రాధాకృష్ణ, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు సహకరించండి..



మాట్లాడుతున్న బంజారా నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మేరమాయాడి ఆలయం ప్రాణ ప్రతిష్ఠకు అందరూ కృషి చేయాలని బంజారా నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 7న సేవాలాల్ ఆలయంలో నిర్వహించే బంజారాల సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రతీ తండా నుంచి నాయక్, కారోబార్, మరియు గ్రామప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. దసరా పండుగ రోజున ప్రతీతండా నుంచి ఆడబిడ్డలు బోనంతో వచ్చి అమ్మవారికి పాత్రులు కావాలని కోరారు. ఇస్లావత్ జగన్, ప్రేమ్‌చంద్, ధరావత్ తార్య, బానోత్ మోతీలాల్, భూక్యా లాలు, బాలాజీ, బన్సీలాల్, మూడ్ హుస్సేన్, మను, మంచ, లక్ష్మా, రూప్‌సింగ్, స్వామి పాల్గొన్నారు.

నీరసించి.. నిలబడలేక!



కొమరారంలో యూరియా విక్రయ కేంద్రం వద్ద క్యూలో ఆధార్ కార్డులు పెట్టిన రైతులు

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో యూరియా కోసం ప్రతీరోజు కోడికూతకు ముందే విక్రయ కేంద్రం వద్ద రైతులు బారులు తీరుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో విక్రయ కేంద్రాన్ని పీఏసీఎస్ అధికారులు తెరవలేదు. పైగా ఆదివారం సెలవు అంటూ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయినా రైతులు ఆదివారం కూడా అన్నదాతలు విక్రయ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఆధార్ కార్డులు వర్షం కురిసినా తడవకుండా ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి క్యూలో ఉంచారు. సోమవారం విక్రయ కేంద్రం తెరవగానే ఈ లైన్ ప్రకారమే యూరియా కట్టలు ఇస్తారని రైతులు చెబుతున్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి



ఇల్లెందురూరల్: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ప్రదర్శిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు చెక్ పోస్టు వద్ద కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు భట్టు రమేష్ మాట్లాడుతూ ప్రధామంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తిపై అనుచిత వాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక రాజకీయ పార్టీ నాయకత్వ హోదాలో ఉండి తల్లిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని విమర్శించారు. కార్యక్రమంలో బానోత్ రమేష్, ఆంజనేయులు, చాట్ల కృష్ణ, రాహుల్‌నేత, సందీప్, నర్సింహారెడ్డి, ప్రశాంత్, అకిల్, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం స్థానిక పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీజేపీ నాయకులు పానిశెట్టి వెంకటేశ్వర్లు, ఎర్రగడ్డ కృష్ణంరాజు, సొంగటి వెంకటేశ్వర్లు ముందస్తుగా అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు.

జూలూరుపాడు: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయకుండా బీజేపీ నాయకులను ఆదివారం జూలూరుపాడు పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ తెలిపారు. రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భూక్యా రవి, యువ మోర్చా మండల అధ్యక్షుడు రాంబాబు, తదితరులు ఉన్నారు.

కుంకుమ పూజలు.. అన్నదానం

సల్లంగ చూడయ్యా.. మా బొజ్జగణపయ్యా.. అంటూ భక్తులు గణేష్ నవరాత్రి ఉత్సవాలను మండప కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఐదో రోజు పలు గణేష్ మండపాలలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని విఘ్నేశ్వరుడిని కోరుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: తిలక్‌నగర్‌లో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



ఇల్లెందు: ఇల్లెందులపాడులో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్థానికులు



టేకులపల్లి కుప్పస్వామి కాలనీలో అన్నదానం



జూలూరుపాడు: కాకర్ల కాలనీలో కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న మహిళలు